సీరియల్ కథ :

# ప్రేమ పుష్పాలు!

★



రచన:

శ్రీ బుద్ధిరాజు నరసింహారావు

(గతసంచిక తరువాయి)

'అమ్మో, చాలా టైం అయిందే' కుమార్ తన రాకకై నిరీక్షిస్తూ వుంటాడు.

వెంటనే లేచి క్రిందకివెళ్ళి మొహం కడుక్కుంది. ప్రభచేత త్వరత్వరగా జడ వేయించుకుంది.

పెరటిలో పూసిన గులాబీలూ, మల్లెలూతెచ్చి ఆమె జడలో పెట్టింది ప్రభ.

పింక్ కలర్‌చీరా మాచింగ్ బ్లౌజూ వేసుకొని అద్దం ముందు తిలకం దిద్దుకుంటున్న జయసుధ హృదయంలో ప్రేమకుమార్ రూపమే నిండివుంది.

'ఎక్కడికే జయా ?' అంటూ గదిలోకివచ్చిన తల్లి ఆశ్చర్యపోయింది.

'మా క్లాస్‌మేట్ అనూరాధ దగ్గరకమ్మా. వాళ్ళన్నయ్య పెళ్ళి పార్టీ అని గుర్తేలేదు' జయసుధ సాకు చెప్పింది.

'ఓహో అలాగా. అయితే వుండు. నాదగ్గరో పాతిక రూపాయలున్నాయి. ఏదైనా కొని ప్రెజెంట్ చేసిరా.' అంది తల్లి.

జయసుధకి తల్లితో అబద్ధం చెప్పినందుకు బాధగా అనిపించింది.

తల్లి మౌనంగానే పాతికరూపాయలు తెచ్చి పర్సులో పెట్టింది.

జయసుధ టాయ్‌లెట్ పూర్తిచేసుకుని బయటకు వచ్చేసింది.

ఆటో చేయించుకుని హోటల్ తాజ్‌వద్ద దిగిపోయింది. మీటర్‌చూసి ఆటోవాడికి డబ్బిచ్చి చుట్టూ కలయచూసింది.

ఎక్కడా ప్రేమ్‌కుమార్ కనబడలేదు.

'హుం!... వేయికళ్ళతో ఎదురుచూస్తూ వుంటానన్న మహానుభావుడు యింకా రానేలేదు.'

చుట్టూ వస్తూ పోతున్న జనాన్నీ, బస్సులనీ, కార్లనీ చూస్తూ అనుకుంది జయసుధ.

రోడ్డంతా జనంతో కిటకిట లాడిపోతోంది. ఒకరికి యింకొకరితో సంబంధం లేనట్లు హడావిడిగా జనం వస్తున్నారు పోతున్నారు.

'ఏంరా కుటుంబరావ్. ఈమధ్య రామచిలుకలు పెంచుతున్నావుట ?'

టక్కున వెనక్కి తిరిగిచూసింది జయసుధ,

తనవెనకనే ఒక పాతికేళ్ళ యువకుడు తనవంకేచూస్తూ చిరునవ్వు నవ్వుతూ పక్కనున్న మరో యువకుడితో అన్నాడు.

'పోనీలేరా రాంబాబూ. నేను రామచిలుకలు పెంచుతే నీవు సరాసరి సీతాకోకచిలకల రవాణా లేకా పుచ్చుకున్నావు. అంతేకదా ?'

రెండో యువకుడు పెద్ద ఘనకార్యం చేసినవాడిలా నవ్వాడు.

వాళ్ళమాటలు తనని ఉద్దేశించేనని జయసుధకి తెలుసు. అలా దారినిపోయే ఆడదాన్ని వంటరిగాచూసి కామెంట్సు చేసేవాళ్ళంటే తనకి అసహ్యం.

ఆమె అక్కడనుంచి కదిలి రోడ్డుకి మరోవైపుకు వెళ్ళి నిలబడింది.

* * *

'హాయ్ జయా !' ప్రేమ్‌కుమార్ కంఠం.

జయసుధ వెనక్కి తిరిగింది.

స్కూటర్‌మిద కూర్చునివున్నాడు ప్రేమ్‌కుమార్ !

'కమాన్ జయా... !'

'ఆహా...వేయికళ్ళతో ఎదురుచూస్తున్నావు కదూ ?' జయసుధ బుంగమూతిపెట్టి కోపం ప్రదర్శించింది.

'తీరికగా, వంటరిగా కూర్చుని కోపతాపాలు తీర్చుకుందువుగాని, కూర్చో !' అన్నాడు ప్రేమ్‌కుమార్ నవ్వుతూ.

'ఎక్కడికి ?'

'ముందు కూర్చో జయా...లెటస్ ఎంజాయ్ ది మోమెంట్ !' ప్రేమ్‌కుమార్ స్కూటర్ మళ్ళా స్టార్ట్ చేస్తూ అన్నాడు.

జయసుధ వెనకాల కూర్చుంది.

స్కూటర్ స్పీడ్ అందుకుంది.

దారిలో యిద్దరూ మౌనంగా వున్నారు.

జయసుధ కుడిచేయి అతని భుజంమీద వుంది.

ప్రేమ్‌కుమార్‌కి యింతదగ్గరలో కూర్చోవడం యిదే ఆమె మొదటిసారి.

ఏడుగంటలు దాటడంవల్ల చీకటిపడుతోంది.





ఎల్. పి. సి. మోనోబ్లాకు రెండు స్టేజీ డీప్ వెల్

- జెట్ పంపులు -

రెండుస్టేజి పంపులు ఎక్కువగా అతిప్రెషర్‌లో సాధారణ జెట్ పంపుకన్నా నీళ్ళ నందించును.

ఎంత లోతైన బావినుండి అయినా సరే మా మోనోబ్లాకు జెట్ పంపు సెట్టులు అతిసులువుగా మీకు నీళ్ళు అందించును.

½ H.P. నుంచి 5 H.P. వరకు దొరకును.

వివరములకు

Grams : "NAIDUBROS"   Phone : Office : 24997 Works : 22757

THE EL-P-EM INDUSTRIALS

393, Mettupalaym Road, (P.B. No. 1053) COIMBATORE-641 002

SALES BRANCHES :-

[illegible], Zeera, Secunderabad - 3.

13/85, Jayachamarajendra Road, Bangalore - 2.

10, Municipal Market Building, Kokkalai, Trichur - 1.

రోడ్డుకి రెండుప్రక్కలావున్న షాపులలో, భవనాలలో విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి. స్ట్రీటులైట్లు లైనుగా ధగ ధగ మెరుస్తున్న పసుపురంగు బంతిపూలదండలా వున్నాయి.

'ఇంతకీ...ఎక్కడికి ప్రేమ్?' మౌనభంగం చేస్తూ అడిగింది జయసుధ.

ఎదురుగా వస్తున్న లారీని తప్పిస్తూ, 'మిలాప్‌కి జయా' అన్నాడు.

'మిలాప్‌కి చీకటిపడ్డాక వెళ్ళి లాభం?' ఆమె ఆశ్చర్యంగా ప్రశ్నించింది.

'మిలాప్‌కి చీకటిపడ్డాకే వెళ్ళాలి డార్లింగ్ జయా.' నవ్వుతూ అన్నాడు ప్రేమ్‌కుమార్.

ఆ నవ్వులో అర్థం తెలియని జయసుధ మరే ప్రశ్నా వెయ్యకుండా మౌనంగా వూరుకుంది. కాని, మిలాప్ అంటే ఎందుకో గుండె జోరుగా కొట్టుకుంది. భయంవేసింది కూడా.

ఆమె ఏవేవో ఆలోచనలతో లీనమైవుండగా స్కూటర్ మలుపు తిరిగింది. అక్కడితో ఆ ఊరిసీమారేఖలు సమాప్తమైనట్లు నిర్మానుష్యంగా తయారైంది రోడ్డు.

అసలు జనసంచారం లేదు.

ఎదురుగా నల్లగా ఎత్తుగావున్న కొండలు!

ఆ కొండలకి యిటువైపే ఆమిలాప్ అన్న ప్రదేశం!

అదొక ప్రకృతి సౌందర్యస్థలం. మంచి పిక్‌నిక్ స్పాట్!

పగలునుండి సాయంత్రం అయిదుగంటలవరకూ అక్కడ జనం నిండుగా వుంటారు. జంటలుగావున్న యువతీ యువకులకైతే అది స్వర్గమే!

ప్రకృతి స్వయంగా తయారుచేసిన పచ్చగడ్డి పాన్పు. ఆప్రదేశంచుట్టూ ఎత్తయిన కొబ్బరిచెట్లూ, ఆ మధ్యనే చిన్న లేక్ - సాధారణంగా చీకటిరాత్రులలో అటువైపెవరూ రారు. వెన్నెలరాత్రులైతే కొన్నిజంటలు వంటరిగా కబుర్లు చెప్పుకోడానికీ, ప్రేమకలాపాలకీ అక్కడికి చేరుకుంటారు.

'దిగండి అమ్మాయిగారూ, గమ్యస్థలం చేరుకున్నాము.' ప్రేమ్‌కుమార్ స్కూటర్ ఆపుతూ అన్నాడు.

'ఆఁ... అయినా యిక్కడి కెందుకు తీసుకువచ్చావు ప్రేమ్...యింటికి వెళ్ళేసరికి లేటయిపోతుంది. నాన్నగారేమనుకుంటారు. ఫ్రెండ్ పెళ్ళి పార్టీకని చెప్పివచ్చాను. రా...వెళ్ళిపోదాం ప్రేమ్. నాకెందుకో భయంగావుంది.'

'భయమా?'

ప్రేమ్ పెద్దగా నవ్వాడు. భయం నాదగ్గరా జయా డార్లింగ్. రా.. భయపడకు ..ఓన్లీ టెన్ మినిట్స్... యిప్పుడే రెండు కబుర్లు చెప్పుకు పోదాం...'

జయసుధని ఏదో తెలియని భయం ఆవరిస్తోంది. ఐనా బాగుండదు. ప్రేమేమైనా అనుకుంటాడేమోనని క్రిందికి దిగింది.

ప్రేమ్ నవ్వుతూ స్కూటర్ పార్క్ చేసి కిందకి దిగి వచ్చాడు.

ఆ మసకచీకటిలోకూడా ప్రేమ్‌కి ఆమె అందమైన ముఖారవిందం కనబడుతూనే వుంది. పయ్యారం ఒలకబోస్తున్న ఆమె సొంపుసొంపులు అతణ్ణి అమాంతంగా కదిలించివేసాయి.

జయసుధ వెనక్కితిరిగి ముందుకు నడిచింది మౌనంగా.

ఆ మసకచీకటిలో ఆమె జడలోని మల్లియలు ప్రేమ్‌ని కల్పించాయి. అతనిమెదడు వేడెక్కిపోయింది. ఆవేశంతో కంపించిపోయాడు. గొంతుక దాహంతో ఎండిపోయినట్లయింది. పిచ్చివానిలా అయిపోయాడు.

జయసుధ ప్రేమ్‌కుమార్ మనోభావాలు అర్థం చేసుకోలేదు. ఆమేదో ఆలోచిస్తూ మెల్లిగా ముందుకు వెళ్తోంది.

ప్రేమ్‌కుమార్ తనని నిగ్రహించుకోలేకపోయాడు. ఈ మధురక్షణాలకోసం తనెంత తపించిపోయాడో! ఈ మధురక్షణాలకేకదా తను వేయికళ్ళతో ఎదురుచూసాడు!

TEXTOM®
VESTS & BRIEFS


Tel: 'TEXTOM' Phone: 23209
TEXTOM KNITTERS
5-A (1) Ramanagar 4th Street. TIRUPUR-638 602

'అబ్బ! ఏమిటీ పిచ్చి ఆలోచనలు. ప్రేమ్‌కుమార్. సమయం దాటితే ఫలితం దక్కకపోవచ్చు. త్వరగా నీ కోరిక తీర్చుకో... !' మనసులోవున్న రాక్షసుడు హెచ్చరించాడు, ప్రోత్సాహించాడు.

'జయా డార్లింగ్ !'

అమాంతంగా ఆకలితో మండిపోతున్న పులిలా జయసుధపై విరుచుకుపడ్డాడు ప్రేమ్‌కుమార్ !

'ప్రేమ్...ఏమిటిది... ?'

'మాట్లాడకు జానీ... నీకోరకు,.. నీ తనువుకోరకు... ఎంతగా తపస్సు చేస్తున్నానో నీకేం తెలుసు ?'

ఆమెని క్రింద పడేసాడు ప్రేమ్‌కుమార్.

'ప్రేమ్...దూరంగా జరుగు... ?'

'జరుగుతాను మైడియర్ స్వప్నసుందరీ...దూరంగానే జరుగుతాను...ముందొక్కసారి నీ అందచందాలు రుచి చూసినతర్వాత !' అంటూ ప్రేమ్‌కుమార్ కసిగా ఆమె మృదువైన పెదవులపై వంగబోయాడు.

'నోనో...ప్లీజ్...ప్రేమ్... !'

'హయ్ మేరీ జానీ... !'

పిచ్చిగా ప్రేమ్‌కుమార్ ఆమె తిరకుచ్చెళ్ళు లాగి పారేశాడు.

'అమ్మో...వద్దు...కసాయివాడిగా...పశువుగా ప్రవర్తించకు ప్రేమ్...నీకు మంచిది కాదు !'

జయసుధ అతని వలలోంచి విడిపించుకోడానికి ప్రయత్నం చేసింది. కాని వృధాప్రయత్నం !

ఇలాంటి మంచిలు ఎన్నో చూసాను జాని ! నీవు నాకు కొత్తకాదు... !'

రాక్షసుడివలె ఆమె బ్లౌజ్ లాగిపారేశాడు ప్రేమ్‌కుమార్!

జయసుధ కెవ్వున అరిచింది.

'అమ్మో...రక్షించండి...వద్దు ప్రేమ్...నన్ను అపవిత్రగా మార్చకు...'

ప్రేమ్‌కుమార్ గుండెలు జోరుగా కొట్టుకుంటున్నాయి. ఆవేశంతో ఆయాసపడుతున్నాడు...ఆమెని గట్టిగా కౌగలించుకున్నాడు.

'రక్షించండి...వదులు పశువా...నీచుడా...మోసగాడా !'

'హ. హా. హా. అరువు. బిగ్గరగా అరువు. నిన్నిక్కడెవ్వడూ రక్షించలేడు. హాయ్ స్వీటీ ...'

ప్రేమ్‌కుమార్ జబర్దస్తీగా ఆమెని ముద్దుపెట్టుకున్నాడు.

జయసుధ కళ్ళల్లో నీరు నిండుకుంది. తన అసహాయతకూ, బుద్ధిలేక ప్రేమ్‌కుమార్‌లాంటి పశువుని ప్రేమించినందుకూ !

'ఆయ్యో...రక్షించండి ..' శాయశక్తులా అరిచింది జయసుధ. ఇక అరిచేశక్తిలేక వెక్కివెక్కి ఏడుస్తోంది.

'దగ్గరికిరా,..'

ప్రేమ్‌కుమార్ మాట పూర్తికాకుండానే అతని దవడ మీద ఎవరో బలంగా కాలుతో తన్నారు,

'అమ్మో.!.!'

ప్రేమ్‌కుమార్‌కి పళ్ళవెంట రక్తం చిమ్మింది.

'ఏంరా స్కౌండ్రల్...ఆరోజున నీతులు చెప్పావే... ఈరోజు నీవు చేస్తున్నదేమిటి ?'

ప్రేమ్‌కుమార్ వెనక్కి తిరిగిచూసాడు. మసక వెలుతురులో అతనిముఖం కనబడలేదు. కాని అతని కంఠస్వరాన్నిబట్టి పోల్చుకోగలిగాడు. అతను చక్రవర్తి !

ప్రేమ్‌కుమార్ కోపావేశాలతో బిగ్గరగా అరిచాడు. 'నీకింత ధైర్యం వచ్చిందా ? మారుమాటాడకుండా వెళ్ళివా సరేసరి. నాదారికి అడ్డువచ్చావో చంపిపారేస్తాను జాగ్రత్త ! రా...నా పంచవన్నెల చిలకా... !'

అతను జయసుధవైపు చేయి జాపాడు. జయసుధ చీర కుచ్చెళ్ళు సరిచేసుకుంటూ దూరంగా జరిగింది.

'మాటలు జాగ్రత్తగా రానీ ప్రేమ్. లేకపోతే...' చక్రవర్తికూడా ఆవేశంగా కంపించిపోయాడు.

కాలేజీలో అంత శాంతంగావుండి తోటి విద్యార్థి విద్యార్థినులవద్ద తల దించుకుని మసలే చక్రవర్తేనా మాట్లాడుతున్నది అని జయసుధ ఆశ్చర్యంగా అలానే నిలబడిపోయింది. నిశ్చేష్టురాలిగా.

'ఓహో...పెద్ద వస్తాదులాగే మాట్లాడుతున్నావే... చూడు బేటా నాతడాఖా !'

ప్రేమ్‌కుమార్ చక్రవర్తిపై కురికాడు.

చక్రవర్తి అతడి దెబ్బకి పక్కకి తప్పుకుని బలంగా అతని వీపుమీద కొట్టాడు.

ప్రేమ్‌కుమార్ తిన్నగా ముందుకి పడ్డాడు. లేచి ఉద్రేకంగా మళ్ళీ చక్రవర్తిమీద పడ్డాడు. ఇద్దరూ గడ్డిమీదదొర్లి ఒకరి మీదొకరు విరుచుకుపడ్డారు.

'మిలాప్' వాతావరణం రణరంగంగా మారింది.

జయసుధ నిశ్చేష్టురాలిగా వారినే చూస్తూవుంది. చివరి దెబ్బ చక్రవర్తే వేసాడు.

ఆ దెబ్బతో ప్రేమ్‌కుమార్ మొహంతిరిగి పడ్డాడు.

చక్రవర్తి లేచి బట్టలు దులుపుకుంటూ అన్నాడు. 'జయసుధగారూ! మీ మేలుకోరి చెప్పబోతే మీరు నన్ను అపార్థం చేసుకున్నారు. నాకు ప్రేమ్ వ్యవహారం అంతా తెలుసు. మీలాంటి ఆమాయకులు వీడిలాంటి రాక్షసులవల్లలో పడి జీవితాంతం మరెన్నడూ తేరుకోలేరు. జీవితాంతం కళంకిగా...జీవితాన్ని బరువుగా...అర్థంలేకుండా చేసుకుంటారు.'

అతనిమాటలకు జయసుధ కృతజ్ఞతతో తల దించుకుని మెల్లిగా అంది. 'చక్రవర్తీ! ఈనాడు మిమ్మల్నీ, మీ మంచితనాన్నీ గుర్తించకలిగాను. ఆనాడు పొరపాటువల్ల మిమ్మల్ని నే నవమానపరిచాను. క్షమాపణ వేడుకుంటున్నాను. మీరు దండిస్తానంటేకూడా నా కభ్యంతరంలేదు.'

'సరే...దానికేం లెండి. మీకు కనువిప్పు అయింది. అదే చాలు. నేను మనసులో ఒకమాటా పైకోమాటా అనే రకం కాదు. రండి వెళదాము. దైవకృపవల్ల ఎలాగైతే నేం...ఆడదానికి అమూల్యమైన నిధిని కాపాడుకోగలిగారు...'

చక్రవర్తి ముందడుగు వేసాడు.

జయసుధ అతణ్ణి అనుసరించింది.

'కాని, యింతదూరం వెళ్ళడం ఎలా?'

'అహాఁ...గాభరా పడకండి...రాక్షసుడి స్కూటర్ వుందిగా? చీకటిలో అంతదూరం నడిచేసరికి రాక్షసుడి ప్రేమభూతం దిగిపోతుంది.'

చక్రవర్తి తిన్నగా నవ్వాడు.

జయసుధకి ఆసమయంలో చక్రవర్తి అంటే అంతు తెలియని అభిమానం పొంగి వచ్చిఁది.

నిజంగా ఎంత చక్కని వ్యక్తిత్వం!

ఇలాంటి ఉత్తముడినా తా నవమానించింది...అంత మందిలో తనెంత గట్టిగా చెంపదెబ్బ కొట్టింది! అయినా తన మనసులో ఎటువంటి కక్ష పెట్టుకోలేదు. ఈనాడు అతను కోరుకుంటే...ప్రతీకారం తీర్చుకోవాలంటే...తన జీవితం...తన అందచందాలు స్త్రీజాతికి అమూల్యమైన శీలం, పరువు, ప్రతిష్టా ధూళిలో కలిసేలా చెయ్యగలడు.

కాని, అలాంటిదేదీ మనసులో పెట్టుకోలేదు. ముక్కూ మొహం తెలియని...అసలు పరిచయమేలేని తనని ప్రేమ్‌కుమార్‌వంటివాడితో ఎటువంటిసంబంధం పెట్టుకోవద్దని హెచ్చరించాడు.

బపితావారి...
ప్రత్యేక తయారింపులు
• సీఫోర్, • చూస్త్రీ,
• రాప్ టూ, • సెలెక్ట్ ఒన్
• దట్ సెలెక్షన్.
ఇవే మా ప్రత్యేక తయారింపులైన
జెట్టీలు - బనియన్లు.
తయారించువారు :
Phone : 22909
**BAPITHA KNITTERS**
Lakshmi Nagar, Tirupur - 638 602.

అయినా తను వినలేదు. వెర్రిఆవేశానికి గురి అయింది.

స్కూటర్ స్టార్ట్ అవ్వడంతో జయసుధ ఆలోచనలు భంగమైనాయి.

'రండి. కూర్చోండి.'

జయసుధ వెనక్కి ఎక్కి కూర్చుంది.

'పర్వాలేదు. నా భుజంమీద చేయి పెట్టుకోవచ్చు,' అన్నాడు చక్రవర్తి.

జయసుధ అలాగే కుడిచేయి అతని భుజంమీద పెట్టింది. ఎందుకో హృదయంలో కలుక్కుమంది. చేయి వణికింది కూడా.

స్కూటర్ ముందుకి పోనిచ్చాడు చక్రవర్తి!

ఇద్దరూ మౌనంగా వున్నారు.

జయసుధకి అతణ్ణి ఏదో అడగాలని వుంది.

చివరికి వుండలేక, 'నాదో చిన్నప్రశ్న...సమాధానం చెప్తారా?' అంది.

'తప్పకుండా,' ముక్తసరిగా అన్నాడు చక్రవర్తి.

'మీరు సరిగ్గా సమయానికి యిక్కడి కెలా వచ్చారు?'

'ఓహో! అదా సమస్య! అంతా దైవాధీనం అనుకోకూడదా!' చక్రవర్తి చిన్నగా నవ్వి ఆమె ప్రశ్నని కొట్టిపారేయబోయాడు.

'నిజం చెప్పండి! మీరు సవ యానికి వచ్చి నన్ను రక్షించకపోతే నాగతేమయ్యేదో...తలచుకుంటేనే భయమేస్తోంది...ప్లీజ్...చెప్పండి..చెప్పకపోతే నామీద ఒట్టే.'

(సశేషం)